క్లుప్తంగా

పలు అంశాలపై సమీక్ష


సమావేశానికి హాజరైన కార్యదర్శులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు, శానిటేషన్, పూడికతీత, చెత్త సేకరణ తదితర అంశాలపై సోమవారం అంతర్గాం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో ఎంఏ అలీం అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాలవారీగా ఇల్లు, నివేశన స్థలాలు లేని అర్హులైన జాబితాను రూపొందించేందుకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎంపీవో వేణుమాధవ్, ఈజీఎస్ ఏపీఎం రమేశ్ పాల్గొన్నారు.

పాలకుర్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం జెడ్పీ సీఈవో నరేందర్ వివిధ అంశాలపై సమీక్షించారు. పారిశుధ్యం, షెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్, పన్ను వసూలు, ఇందిరమ్మ కమిటీల ఎంపిక తదితర అంశాలపై వివరించారు. ఎంపీడీవో శశికళ, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


శ్రీనివాస్


లక్ష్మీవాణి

కోల్‌సిటీ: రామగుండం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు క్యాస శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ లక్ష్మీవాణి, కోశాధికారిగా ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ నాగిరెడ్డిని ఎన్నుకున్నారు.

గడువు దాటిన పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

కాల్వశ్రీరాంపూర్: ఎరువుల దుకాణాల్లో గడువు దాటిన పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో నాగార్జున హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో దుకాణాలను తనిఖీ చేశారు. ఏఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

సన్మానం


రాజేశంను సన్మానిస్తున్న కవులు

రామగిరి: కల్వచర్ల గ్రామానికి చెందిన కవి నూనే రాజేశంను సోమవారం కవులు సన్మానించారు. కరీంనగర్ వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో కవి, రచయిత వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన మహాకవి దాశరథి స్మృతులను స్మరించుకుంటూ 84 మంది కవులకు సన్మానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూకంటి జగన్నాథం, జెల్లి విద్యాదర్, రాధా కుసుమ, గద్దూరి వెంకటదాస్ హాజరై దాశరథి సేవలను కొనియాడారు. రాజేశంను శాలువాతో సన్మానించి పుస్తకాలు అందజేశారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వకీల్‌పల్లి గ్రామస్తులు

రామగిరి: సెంటనరీకాలనీ వకీల్‌పల్లి ప్లాట్లలో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మించాలని సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సింగరేణి ఆర్‌అండ్‌ఆర్ నిధుల ద్వారా గతంలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం చేపట్టాలని తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో ఉందని, సరైన సౌకర్యాల్లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఆసిఫ్‌పాషా


నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కార్పొరేషన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఆసిఫ్‌పాషాను నియమించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆసిఫ్‌పాషాకు నియామక పత్రాన్ని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అందజేశారు.

యువత హద్దు మీరితే కఠిన చర్యలు

- గోదావరిఖని ఏసీపీ రమేశ్


యువకులను హెచ్చరిస్తున్న ఏసీపీ రమేశ్

గోదావరిఖని: హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని ఏసీపీ రమేశ్ హెచ్చరించారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో దసరా పండుగ సందర్భంగా సింగరేణి స్టేడియంలో కొట్లాటకు దిగి ప్రజలను భయాందోళనకు గురిచేసిన యువకులకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. దసరా సందర్భంగా మద్యం తాగి వచ్చి ఇరువర్గాలు కొట్టుకుంటూ ప్రజల్లో భయాందోళన సృష్టించారన్నారు. ఈక్రమంలో ఇరు వర్గాల యువకులను గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలకు పాల్పడితే ఊరుకోబోమని హెచ్చరించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని ఏసీపీ సూచించారు. ఏమైనా తప్పు పనులు చేస్తే మందలించాలని, అవసరమైతే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. జనావాస ప్రాంతాల్లో భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారని అన్నారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.


బతుకమ్మ ఆటాపాటా


కమలం ఆకారంలో బతుకమ్మల అలంకారం


బతుకమ్మతో ఇమ్మడి మధుమిత-సాయిరాం

నార్త్ కరోలినాలో బతుకమ్మ సంబరం

కాల్వశ్రీరాంపూర్: ఖండాంతరాల్లో బతుకమ్మ ఖ్యాతి విస్తరించింది. అమెరికాలోని నార్త్ కరోలినా స్టేట్ వ్యాలి, మార్స్‌వెల్లి పట్టణాల్లో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాకు చెందిన ఆడపడుచులు బతుకమ్మ సంబరాలు కన్నుల పండువగా జరుపుకున్నారు. భారత దేశంలోని పలు రాష్ట్రాల ప్రజలతోపాటు అమెరికన్లు, పలు దేశాల ప్రజలు బతుకమ్మ వేడుకలు ప్రత్యక్షంగా చూశారని, పూలను పూజించే సద్దుల బతుకమ్మ విశేషాలు, బతుకమ్మకు నైవేద్యంగా సమర్పించే పిండి వంటల గురించి అక్కడి ప్రజలు, ఎన్‌ఆర్‌ఐలు తెలుసుకొని అభినందించారని తెలంగాణవాసులు పేర్కొన్నారు. ట్రయాంగిల్ తెలంగాణ అసోసియేషన్(టీటీజీఏ) నేతృత్వంలో తొమ్మిది రోజులు నిర్వహించిన ఈ వేడుకలు ఈనెల 12న ముగిశాయని, సుమారు 3,000 మంది హాజరైనట్లు మీర్జంపేట గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు పచ్చిక రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఎన్టీపీసీ పీటీఎస్ సెక్యూరిటీ విభాగానికి వాహనం కరువు

- నెల రోజులుగా సొంత వాహనాలపై భద్రతా విధులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు అధికారులు, ఉద్యోగులు నివసించే పర్మనెంట్ టౌన్‌షిప్ 24 గంటల భద్రత సిబ్బంది ఆధీనంలో ఉంటుంది. టౌన్‌షిప్‌కు ఉన్న రెండు ప్రధాన గేట్ల వద్ద సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. గేట్‌తోపాటు టౌన్‌షిప్‌లోని ముఖ్య కేంద్రాల వద్ద ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో వాహనంలో గస్తీ తిరిగి భద్రత, రక్షణ చర్యలను పటిష్టపరిచేవారు. 45 రోజుల క్రితం సెక్యూరిటీ వాహనం టెండర్ గడువు పూర్తి కావడంతో వాహనాన్ని నిలుపుదల చేశారు. కొత్త టెండర్‌కు జాప్యం కావడంతో పాత వాహనానికి గడువిచ్చే అవకాశాలుంటాయి. కాని పాత వాహనానికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వకపోవడంతోపాటు కొత్త వాహనాన్ని సమకూర్చకపోవడంతో సెక్యూరిటీ సిబ్బంది విధులకు కొంత జాప్యమవుతున్నట్లు సమాచారం. సిబ్బంది గతంలో వాహనంలో వెళ్లి పీటీఎస్‌లో గస్తీ చేపట్టేవారు. ప్రస్తుతం సొంత వాహనాలపై గస్తీ తిరగాల్సి రావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థకు పూర్తిస్థాయి భద్రత వహించే సిబ్బందికి వాహనం కేటాయించకపోవడంపై పలువురు ఉద్యోగులు ఇదేమిటని చర్చించుకుంటున్నారు. గుర్తింపు సంఘాల నాయకులు సెక్యూరిటీ సిబ్బందికి వాహనం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగ కుటుంబాలు కోరుతున్నాయి.


ఈసాలతక్కళ్ళపల్లి పూర్వ విద్యార్థులు


లద్నాపూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పాలకుర్తి: ఈసాలతక్కళ్ళపల్లి గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 2005–06 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా, ఉత్సాహంగా గడిపారు. గురువులను సన్మానించి సహపంక్తి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులు జీవన్‌రాజ్, ప్రవీణ్, చంద్రశేఖర్, రవీందర్ పాల్గొన్నారు.

రామగిరి: లద్నాపూర్ వందన పాఠశాల 2007–08 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం సెంటనరీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్థాయి విద్యనభ్యసించిన రోజులు ఎంతో విలువైనవని పలువురు అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ముడుసు లక్ష్మణ్, ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

యువత చూపు బీజేపీ వైపు


సుల్తానాబాద్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ జోనల్ ఇన్‌చార్జి రవికుమార్

సుల్తానాబాద్: యువత బీజేపీ వైపు చూస్తున్నారని హైదరాబాద్ జోనల్ ఇంచార్జ్ రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని కోర్టు చౌరస్తా వద్ద ఓబీసీ మోర్చా మండల ప్రెసిడెంట్ సదయ్య ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి చెందే దేశంలో భారత్ ప్రథమ స్థానంలో ఉన్నందున యువత ఉపాధి ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమయిందని, రానున్న రోజుల్లో ప్రభుత్వంపై ఆందోళన చేస్తామన్నారు. గంగుల సంతోష్ తదితరులున్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు


పెద్దబొంకూర్‌లోని నర్సరీలో మొక్కలకు నీరు పడుతూ..

పెద్దపల్లిరూరల్: మండలంలో హరితహారం కార్యక్రమంలో రహదారులకిరువైపులా నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఈజీఎస్ ఏపీవో రమేశ్‌బాబు అన్నారు. పెద్దబొంకూర్‌లోని నర్సరీ, రోడ్లకిరువైపులా నాటిన మొక్కలకు నీరు పోసే పనులను పరిశీలించారు.

పెద్దపల్లికి ట్రీగార్డులు

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నాటిన మొక్కలను కాపాడేందుకు వాటికి రక్షణగా అమర్చేందుకు అవసరమైన 4వేల ట్రీగార్డులు సోమవారం పెద్దపల్లికి చేరాయి. వాటిని 13 మండలాలకు పంపిణీ చేశారు. మండల పరిధిలోని పంచాయతీలకు అవసరాలను బట్టి తీసుకుంటారని డీఆర్‌డీవో కార్యాలయ అధికారి మధుకర్ తెలిపారు.

గ్రంథాలయ చైర్మన్‌కు అభినందన


సత్తు మల్లేశంను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించిన సత్తు మల్లేశంను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అభినందించారు.

పరామర్శ

సుల్తానాబాద్‌రూరల్: మంచిర్యామికి చెందిన భూపతిపూర్ తాజా మాజీ సర్పంచ్ జమున తిరుపతి కూతురు భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. సోమవారం ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. ఢీకొన్న వాహనాన్ని వెంటనే పట్టుకోవాలని ఎస్సై శ్రావణ్‌కుమార్‌కు సూచించారు.

అమ్మవారి కానుకల వేలం


లడ్డూ అందజేస్తున్న నీలయ్య

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి భక్తులు వస్తువులు సమర్పించారు. సోమవారం అమ్మవారికి పోసిన ఒడి బియ్యంతో అన్నదానం నిర్వహించారు. చీరలు, లుంగీలు, జాకెట్ పీసులు, అద్దాలు, దువ్వెన, లడ్డూ వేలం వేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్త మార్కండేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వలస నీలయ్య, భాస్కర్, తిరుపతి పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని శివాలయంలో దంపతులు బండారి లావణ్య –శ్రీనివాస్ స్వామివారికి పలు పండ్లతో రుద్రాభిషేకం నిర్వహించారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధి పెద్దంపేట గ్రామంలోని అమ్మవారి మండపంలో కలశం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన కోల నర్సయ్య–లక్ష్మి దంపతులు రూ.40వేలకు దక్కించుకున్నారు.

అన్నదానం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నల్ల మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మనోహర్‌రెడ్డి కుమార్తె శ్లోకారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని భక్తులకు అన్నదానం నిర్వహించారు.


కమాన్‌పూర్: మండల కేంద్రం నుంచి పిల్లిపల్లె మీదుగా మంథని–పెద్దపల్లి రహదారిపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద చెట్లుండడంతో.. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక గతంలో ఒకరు మృతిచెందారు. మలుపుల వద్ద ఉన్న చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, కమాన్‌పూర్, సెల్ నం: 7032032020

వాట్సాప్ చేయండి..
మా ఫోన్ నంబర్ : 97053 46608

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సాయం

పెద్దపల్లిరూరల్: నిరుపేద కుటుంబానికి చెందిన కొండ తేజ ఎంబీబీఎస్ చదువు కోసం ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేలను ఎంఈవో సురేందర్, హెచ్‌ఎం లక్ష్మయ్య చేతులమీదుగా అందజేశారు. భూపాలపల్లి జిల్లా మహాముత్తారంకు చెందిన తేజ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడని సొసైటీ ప్రతినిధి లింగమల్ల శంకర్ తెలిపారు. వెంకటస్వామి, రాజేశం, రాజన్న, వెంకటేశ్వర్లు, శ్రావణ్ తదితరులున్నారు.

నేడు చేప పిల్లలు పంపిణీ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఈనెల 15న చేప పిల్లల పంపిణీ నిర్వహిస్తున్నామని జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ హాజరు కానున్నారన్నారు. మత్స్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో సోమవారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	01	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	10	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	04	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	09	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	02	448
పార్వతీపురం స్పెషల్	12	672
పార్వతీపురం సాధారణ	08	336

– వేములవాడ

రిటైర్డ్ కార్మికులను గౌరవంగా సాగనంపాలి


ప్రసంగిస్తున్న ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: సంస్థ కోసం సర్వస్వం త్యాగం చేసి రిటైరయ్యే సింగరేణి కార్మికున్ని సంస్థ వాహనంలో ఇంటివరకు తీసువెళ్లి దింపి రావాలని, సెక్యూరిటీ సిబ్బందితో గౌరవ వందనం ఏర్పాటు చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సూచించారు. సోమవారం సింగరేణి ఉజ్వల భవిష్యత్–ఉద్యోగుల పాత్ర కార్యక్రమంలో ఆర్జీ–1 ఏరియా జీడీకే–11 గని, ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంస్థ విస్తరణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో కోల్‌బెల్ట్ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నానని అన్నారు. ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు


చిన్నబోంకూర్–మియ్యాపూర్ రోడ్డు

సుల్తానాబాద్‌రూరల్: చిన్నబోంకూర్–మియ్యాపూర్‌కు వెళ్లే దారి దాదాపు 6 కిలోమీటర్లుండగా.. పదికి పైగా మలుపులున్నాయి. వాహనం దగ్గరకొస్తే గాని కనబడని పరిస్థితి నెలకొంది. ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.


కమాన్‌పూర్‌లో అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర

శోభాయమానం.. దుర్గామాత నిమజ్జనం

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యువసేన, గుండారంలో భవానీ యూత్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పు, డోలు, గుస్సాడీ నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు, మహిళల కోలాటాలు, నెత్తిన బోనాలు, డీజే సౌండ్లతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.